ఇటిక్యాలలో దొంగల హల్‌చల్

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 18 : మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాలలో కాంద్రపు ప్రసాద్, వేముల రామయ్య అనే ఇద్దరి ఇండ్లలో దొంగలు హల్చల్ చేశారు. ఎస్ఐ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 13న కాంద్రప్రసాద్ పని నిమిత్తం ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి గుర్తుతెలియని దొంగలు ఇంట్లో బీరువాలో ఉన్న చెవికమ్మలు దోచుకెళ్లారని తెలిపారు. మరో వ్యక్తి వేముల రామయ్య సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి పనికి వెళ్లగా ఆయన ఇంట్లోకి చొరబడి తులం బంగారం దొచుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.45 వేలు ఉంటుందని, కాంద్రపు ప్రసాద్, వేముల రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు.

దవాఖాన భవనం నుంచి దూకిన రోగి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 18 : బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ 100 పడకల దవాఖాన భవనం నుంచి రోగి దూకిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 17న కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి గ్రామానికి చెందిన సొండ్ల పున్నం అతిగా మద్యం తాగి భార్యతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో కుటుంబ సభ్యులు బెల్లంపల్లి వంద పడకల దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతున్న పున్నం అదేరోజు మధ్యాహ్నం దవాఖాన భవనం మొదటి అంతస్తుకు చేరుకొని అక్కడి నుంచి కిందికి దూకాడు. ఈ ఘటనలో పున్నం ముక్కు, నుదురు భాగంలో గాయాలు కావడంతో దవాఖాన సిబ్బంది వెంటనే మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

రైల్వే ట్రాక్ ప్లేట్లు చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్

జైపూర్, ఫిబ్రవరి 18: మండలంలోని టేకుమట్ల గ్రామశివారులో గల రైల్వేట్రాక్ ఇనుప ప్లేట్లను దొంగిలించేందుకు యత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకుని ఎస్అండ్‌పీసీ వారికి అప్పగించారు. ఎస్అండ్‌పీసీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంపూర్ ప్రాంతానికి చెందిన కొట్టె ప్రవీణ్‌తో పాటు మరొక్కరు మంగళవారం రైల్వేట్రాక్ ఇనుప ప్లేట్లను తొలగించి దొంగిలించేందుకు ప్రయత్నిస్తుంగా స్థానిక యువకులు చూసి ఒకరిని పట్టుకోగా మరొకరు పారిపోయారు. పట్టుబడ్డ దొంగను అతని వద్ద సుమారు 80 కిలోల వెయిట్‌గల ఇసుప సామగ్రిని స్వాధీనం చేసుకుని జైపూర్ పోలీసులకు అప్పగించారు. వీరి వద్ద మొబైల్ ఫోన్, ద్విచక్రవాహనం, దొంగిలించిన ఇనుప సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 18: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోదావరి రైల్వే బ్రిడ్జి సమీపంలో పట్టణంలోని అశోక్ రోడ్డుకు చెందిన సయ్యద్ జమీర్ (27) అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంసత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు, కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం గుర్తు తెలియని రైలు కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు జమీర్‌కు భార్య రిజ్వాన, కుతురు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఎస్కార్ట్ నుంచి తప్పించుకున్న వ్యక్తికి ఏడాది జైలు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 18 : కోర్టు నుంచి జైలుకు తరలిస్తుండగా పోలీస్ ఎస్కార్ట్ నుంచి తప్పించుకుని పారిపోయిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధించినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. గతేడాది అక్టోబర్ 16న పది కేసులలో నిందితుడైన నెన్నెల మండలం కోనంపేటకు చెందిన నాయిని బాపును బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నుంచి ఆసిఫాబాద్ సబ్ జైలుకు తరలించడానికి బెల్లంపల్లి కాంటా చౌరస్తాలో ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా పారిపోయాడు. కానిస్టేబుల్ నాగరాజు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌హెచ్‌వో దేవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి ముఖేశ్ శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

పర్యావరణ ట్యాక్స్ రద్దు

జన్నారం, ఫిబ్రవరి 18 : కవ్వాల్ కోర్ ఎరియాలో ఉట్నూర్, కడెం, దస్తురాబాద్, జన్నారం, దండెపెల్లి మండలాల్లోని స్థానిక వాహన దారులకు పర్యావరణ ట్యాక్స్‌ను రద్దు చేస్తూ పీసీసీఎఫ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు మంచిర్యాల డీఎఫ్‌వో శివ్ ఆశిష్‌సింగ్ తెలిపారు. స్థానిక వాహన దారులు రాకపోకలు జరిపినపుడు అటవీ శాఖ చెక్ పోస్ట్‌ల వద్ద అక్కడి అధికారులకు ఏదైనా గుర్తింపు కార్డును చూపించి సహకరించాలని కోరారు.

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ యూత్ నాయకుడు

కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కాటం రాజు

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 18: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును కలిసి నస్పూర్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ యూత్ విభాగం నాయకుడు కాటం రాజు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన ఆయనను కలిశారు. తనలాంటి చిన్న కార్యకర్తకు కలవడానికి అవకాశం ఇచ్చిన పార్టీ నేతలకు, తమ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారు

బీఆర్ఎస్ డైరీ, క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న సబ్బని అరుణ్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 18 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాలనను ప్రజలు కోరుకుంటున్నారని బీఆర్ఎస్ యూత్ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు సబ్బని అరుణ్ తెలిపారు. పార్టీ నూతన సంవత్సర డైరీలు, క్యాలెండర్లను మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అసహనంతో ఉన్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నూనేటి సత్యనారాయణ, నాయకులు కొమ్మెర లక్ష్మణ్, అలీభాయ్, బిడ్డల విజయ్, మనీ, సందీప్, ప్రవీణ్, ఖలీల్, సతీశ్ పాల్గొన్నారు.

పిల్లల సంఖ్య పెరిగితే టీచర్‌ను కేటాయిస్తాం

భీమారం, ఫిబ్రవరి 18 పోతన్‌పల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగితే టీచర్‌ను కేటాయిస్తామని మంచిర్యాల జిల్లా విద్యాధికారి యాదయ్య సూచించారు. ఎంపీపీఎస్ పాఠశాలను పరిశీలించారు. పిల్లలకు పాఠ్యాంశాలకు సంబంధించిన పలు ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఉపాధ్యాయుడికి సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు.

ఆత్మగౌరవ సభకు తరలిన ఆర్ఎంపీలు

దండేపల్లి/చెన్నూర్ ఫిబ్రవరి18: హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన గ్రామీణ వైద్యుల ఆత్మ గౌరవ సభకు మండలంలోని ఆర్ఎంపీలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జీవో నెం 1273-2009 ప్రకారం శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు.ఆర్ఎంపీ, పీఎంపీ, సీపీలపై జరుగుతున్న దాడులు నిలిపివేసి కేసులు ఎత్తివేయాలన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మానిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా కమ్యూనిటీ పారామెడిక్స్ గుర్తింపు ఇవ్వాలన్నారు. ఆత్మగౌరవ సభకు తరలివెళ్లిన గ్రామీణ ప్రాంత వైద్యులు చెన్నూర్ నుంచి పెద్ద సంఖ్యలో గ్రామీణ ప్రాంత వైద్యులు తరలివెళ్లారు.

వేలాల జాతరను విజయవంతం చేయాలి

జైపూర్, ఫిబ్రవరి 18: ఈ నెల 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని వేలాల గ్రామంలో నిర్వహించే జాతరను విజయవంతం చేయాలని మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, డీపీవో వెంకటేశ్వర్‌రావులు పేర్కొన్నారు. మంగళవారం ఎస్టీపీపీ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తులకు వసతులు కల్పించాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్ఐ శ్రీధర్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో బాపురావు, పర్సనల్ అధికారి తుకారాం తదితరులున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మందమర్రి రూరల్, ఫిబ్రవరి18: వ్యవసాయ రంగానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా ఎదగాలని చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని సారంగపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో వ్యవసాయ అనుబంధ రంగాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి కల్పన, ఏఈవో ముత్యం తిరుపతి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ రాజేశ్, పంచాయతీ కార్యదర్శి సవ్య, రైతులు కమల మనోహర్, ఫిరోజ్, రాయమల్లు, ఆసంపెల్లి రాజయ్య, ఖలీమ్, గౌస్, ముజఫర్, మహేందర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, కారోబార్ మధు పాల్గొన్నారు.

బాలికలు కష్టపడి చదివి అన్ని రంగాల్లో రాణించాలి

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 18: బాలకలు కష్టపడి చదివి అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని పట్టణ ఎస్ఐ జీ రాజశేఖర్ అన్నారు. రామకృష్ణాపూర్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసి అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళపై జరుగుతున్న నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టాలు, సైబర్ నేరాలు అరికట్టడం, షీ టీం సేవలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, ప్రధానోపాధ్యాయురాలు, ఏఎస్ఐ వెంకన్న హెడ్ కానిస్టేబుల్ సురేశ్, స్వాతి పాల్గొన్నారు.

ఆర్టీసీని లాభాలబాటలో నడిపించాలి : డీఎం

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 18: ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది సంస్థను లాభాల బాటలో నడిపించడానికి తమ కృషిచేయాలని మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ జనార్దన్ కోరారు. ఆర్టీసీ ఎండీ ఆదేశాల ప్రకారం సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది, సూపర్‌వైజర్లకు నెల రోజుల పాటు పవర్ పేరుతో నిర్వహించే మోటివేషనల్, రిఫ్రెష్ కార్యక్రమాలను మంగళవారం ఆయన ప్రారంభించారు.

దివ్యాంగులకు ఉచితంగా సహాయ ఉపకరణాలు

చెన్నూర్, ఫిబ్రవరి 18: జిల్లాలోని దివ్యాంగులకు ఉపయోగపడే విధంగా జిల్లా శిశు, మహిళ, దివ్యాంగులు సంక్షేమశాఖ, అలింకో సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా సహాయ ఉపకరణములను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి రౌఫ్‌ఖాన్ అన్నారు. చెన్నూర్ పట్టణం మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో దివ్యాంగుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ చెన్నూర్ సీడీపీవో మనోరమ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

20న దివ్యాంగుల ఉపకరణాల క్యాంపు

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 18: మున్సిపాలిటీలో ఈ నెల 20న నిర్వహించదలచిన దివ్యాంగుల క్యాంపును మున్సిపాలిటీలో అర్హులైన దివ్యాంగులందరూ సద్వినియోగం చేసుకోవాలని లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ సూచించారు. మున్సిపల్ పరిధిలోని మార్కెట్ యార్డ్ లో ఉన్న రైతు వేదిక వద్ద నిర్వహించే క్యాంపునకు వచ్చే సదరం సర్టిఫికెట్, లేదా ఫిజీషియన్ ధ్రువీకరించిన పత్రం, యూడీఐడీ కార్డు, రేషన్ కార్డ్, ఆహార భద్రత కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ తదితర ధ్రువీకరణ పత్రాలతో తీసుకురావాలని సూచించారు.

ఆరు గ్యారెంటీల కోసం 'చలో హైదరాబాద్'

కన్నెపల్లి, ఫిబ్రవరి 18 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 20న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం పోస్టర్లను మంగళవారం కన్నెపల్లి మండలంలోని చింతపూడి గ్రామంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. నిరుద్యోగులు, మహిళలు, రైతులు, కార్మికులను, అన్ని వర్గాల వారిని మోసం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోహర్, మహేశ్, తిరుపతి, రాజశేఖర్, భీమయ్య, సుశీల, వెంకటమ్మ, రామక్క,రేణుక తదితరులు పాల్గొన్నారు.

గడ్డం గూడెంలో గుడిసెల కూల్చివేత

- కోర్ ఏరియాలో ఉన్నందుకే తొలగించినం : ఎఫ్ఆర్వో సుష్మారావు
- చచ్చినా ఇక్కడి నుంచి వెళ్లేది లేదు : గడ్డం గూడెం వాసులు

జేసీబీతో ఇండ్లను కూల్చివేస్తున్న అధికారులు

రాత్రి వేళలో ఇండ్లను కూల్చివేస్తున్న అటవీ అధికారులు

జన్నారం, ఫిబ్రవరి 18 : మంచిర్యాల జిల్లా కవ్వాల్ అడవుల్లోని జన్నారం రేంజ్, సెక్షన్, బీట్‌లలోని కంపార్ట్‌మెంట్-308 లోగల గడ్డంగూడెంలో గిరిజనులు వేసుకున్న 27 గుడిసెలను అటవీ అధికారులు చిమ్మచీకట్లో వచ్చి తొలగించారు. మంగళవారం తెల్లవారు జామున 2 గంటల ప్రాంతంలో అక్కడికి చేరుకున్న అధికారులు జేసీబీలతో గుడిసెలను తొలగించడంతో వారంతా కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ఇక్కడ దాదాపు 200 మంది గిరిజనులు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎలాంటి సమాచారమివ్వకుండా రాత్రిపూట వచ్చి ఇండ్లు కూల్చివేయడమేమిటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు.. వృద్ధులు ఉన్నారన్న కనికరం కూడా చూపించకుండా.. ఫోన్‌లు లాగేసుకొని జేసీబీలతో విరుచుకుపడ్డారని వారు వాపోయారు. ఈ విషయమై ఎఫ్ఆర్వో సుష్మారావును వివరణ కోరగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కంపార్ట్‌మెంట్‌లోని ఇళ్లను కూల్చివేశామని, కోర్ ఏరియాలో ఎవరూ నిర్మాణాలు చేపట్టరాదని ఆమె తెలిపారు.

చచ్చేంతవరకూ ఇక్కడే ఉంటా..

ఎన్నో సంవత్సరాల నుంచి ఇక్కడ వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నాం. ఇప్పుడు ఫారెస్ట్ ఆఫీసర్లు రాత్రి పూట వచ్చి మా ఇండ్లను కూల్చివేశారు. కానీ బతికున్నంత కాలం ఇక్కడే ఉంటా. ఎవరూ ఏమి చేస్తారో సూస్తాం.

-టోక్యా, గడ్డంగూడెం వాసి

ఎన్ని కేసులు పెట్టినా వెళ్లేది లేదు..

ముసల్లోలు, చంటి పిల్లలు న్నారనే కనికరం లేకుండా అర్ధ రాత్రి వచ్చి ఫారెస్ట్ ఆఫీసర్లు మా ఇండ్లను అన్యాయంగా కూల్చిండ్రు. ఇప్పటికే మామీద ఎన్నో కేసులు పెట్టిండ్రు. ఇప్పుడు ఇండ్లు కూల్చినా మేము భయపడం. మళ్ల ఇండ్లను కట్టుకుంటాం.

-రాథోడ్ నీలాబాయి, గడ్డంగూడ వాసి

మేమంతా ఎట్లా బతకాలి..

మా గూడెంలో 27 ఇండ్లు ఉన్నయి. ఇక్కడ 200 మంది దాకా జీవిస్తున్నం. ఇప్పటి వరకు మా గూడెంలోని 93 మందిపై కేసులు పెట్టిన్రు. రాత్రి పూట ఒక్కసారిగా వందలాది మంది అధికారులు వచ్చి మా ఇండ్లను కూల్చివేసిన్రు. ఇప్పుడు కుట్టబట్టలతో మిగిలాం. మేమంతా ఎక్కడికి వెళ్లాలి. ఎలా బతుకాలి. ఇది అన్యాయం. ఇక్కడికి నుంచి మేం కదిలేది లేదు.

- భూక్య శివ, గడ్డంగూడ వాసి

కంపార్ట్‌మెంట్‌లో ఉన్నందుకే ఇండ్లను కూల్చివేశాం

కవ్వాల్ అడవుల్లోని 308 కంపార్ట్‌మెంట్ కోర్ ఏరియా ప్రాంతంలో ఉన్నందున ఉన్నతాధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ఆ కాంపార్ట్‌మెంట్‌లో ఉన్న ఇండ్లను కూల్చివేసినట్లు తెలిపారు. కోర్ ఏరియాలో ఎవరూ ఇండ్లు నిర్మించినా సాగు చేసినా నేరమని తెలిపారు.

-ఎఫ్ఆర్వో సుష్మారావు, జన్నారం

తాగునీటి సమస్య లేకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

నల్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

కెరమెరి, ఫిబ్రవరి 18: వేసవికాలం సమీపిస్తున్నందున ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ముందస్తు ప్రణాళికతో నిరంతరం నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. మంగళవారం జిల్లాలోని కెరమెరి మండలం సాకడ గ్రామపంచాయతీలో పర్యటించి మిషన్ భగీరథ నీటి నాణ్యత, తాగునీటి కోసం తీసుకోవాల్సిన చర్యలపై పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ద్వారా తాగునీటిని అందించాలని, ఈ నేపథ్యంలో నీటి ట్యాంకుల శుభ్రత, పైప్ లైన్ మరమ్మతులను వేగవంతం చేసి లీకేజీ సమస్య లేకుండా నీటి సరఫరా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నమూనాను పరిశీలించారు. కార్యక్రమంలో డీపీవో భిక్షపతి గౌడ్, తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, ఎంపీడీవో మహ్మద్ అమ్జద్‌పాషా, మిషన్ భగీరథ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డీటీసీపీ అనుమతి లేని ప్లాట్లు కొనద్దు

- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

భీమారం, ఫిబ్రవరి 18 డీటీసీపీ అనుమతులు లేని లేఅవుట్లలోని ప్లాట్లు కొనవద్దని, భీమారం మండల కేంద్రంలో ఇస్కాన్ పేరుతో ప్రజలకు ప్లాట్లు అమ్ముదామని చూస్తున్నారని, వారికి 41-ఏ కింద నోటీసులు జారీ చేస్తున్నట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. భీమారం మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం విలేకరులు సమావేశం నిర్వహించి ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఏపీపీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్ చెందిన సంస్థ సభ్యులు ఇస్కాన్ సంస్థ వారి పేరును, లోగోను, వాడుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని వారిపై చట్ట రీత్యా చర్య తీసుకోవాలని ఇస్కాన్ సంస్థ జనరల్ మేనేజర్ హన్‌మాన్ విజయదాస ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిస్కో ఇన్‌ఫ్రా డేవలపర్స్ ఎల్ఎల్‌పీ, పాలాష్ చంద్ర దాస మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. జైపూర్, భీమారం, చెన్నూర్ పట్టణాల్లో అక్రమంగా ఏర్పాట్లు చేసిన వెంచర్లలో ప్లాట్లు కొనవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్, ఎస్ఐ కె. శ్వేత తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని నివారించాలి

నస్పూర్/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 18 : రానున్న వేసవి కాలంలో సాగునీటికి, తాగునీటికి ఎలాంటి సమస్య లేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ తాగునీటికి ఇబ్బందులు లేకుండా నిరంతరం నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. రబీ సీజన్ కోసం సాగునీటి సమస్యలేకుండా ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని అన్ని ప్రాంతాలకు నీటిని అందించేందుకు అధికారుల సమస్యతో చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి ఇబ్బందులు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆసిఫాబాద్ కలెక్టరేట్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, డీపీవో భిక్షపతి గౌడ్, జిల్లా విద్యుత్ శాఖ అధికారి శేషారావు, వ్యవసాయ, నీటి పారుదల, పౌర సరఫరాల శాఖల అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీ హబ్ ఏర్పాటుకు కృషి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 18 : బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రంలో ఐటీ హబ్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మండల శివారులోని ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాత్రి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యను వ్యాపారం చేసిన వారికి గుణపాఠం చెప్పాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్

మందమర్రి, ఫిబ్రవరి 18: పుస్తకాలు అమ్మి, ఫీజులు వసూలు చేసి విద్యను వ్యాపారం చేసిన వారికి రానున్న పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కరీంనగర్ మాజీ మేయర్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రులు ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ పిలుపు నిచ్చారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన మంగళవారం మందమర్రి పట్టణంలో పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. సింగరేణి పాఠశాల మైదానంలో వాకర్స్‌తో పాటు నిరుద్యోగ పట్టభద్రులను, యోగా శిక్షకులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. అనంతరం మైదానంలో క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడి సందడి చేశారు. మార్కెట్‌లో కలియ తిరుగుతూ పట్టభద్రులను కలిసి ఓట్లు వేయాలని కోరారు. పాఠశాల మైదానానికి చేరుకొని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజా రమేశ్, జే.రవీందర్, మేడిపల్లి సంపత్, బడికెల సంపత్ కుమార్, బండారు సూరిబాబు, కనకం రవీందర్, ముస్తఫా, శివనాయక్, కొల్లూరి రతన్, పల్లె నర్సింగ్, పూసాల ఓదెలు, సీపెల్లి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్‌లో..

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 18: ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రవీందర్‌సింగ్ క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ సేయింట్ జాన్స్, సేయింట్ ఆల్ఫోన్సా కాన్వెంట్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి ప్రచారం చేశారు. తను గెలిపిస్తే రూపాయకే రూ.5 లక్షల ఇన్సూరెన్స్ తానే స్వయానా వచ్చి సొంతడబ్బులతో ఇన్సూరెన్స్ చేయిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు బీఆర్ఎస్ నియోజకవర్గం నాయకుడు డాక్టర్ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేశ్‌బాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్‌గౌడ్, సీనియర్ నాయకుడు రామిడి కుమార్, బడికల సంపత్‌కుమార్, అలుగుల సత్యం, జే కుమార్, రామిడి లక్ష్మీకాంత్, డబ్బేటి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

మాదారం టౌన్ షిప్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

మాదారం టౌన్‌షిప్‌లో మాట్లాడుతున్న తాండూర్ సీఐ కుమారస్వామి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 18 : తాండూర్ మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో తాండూర్ సీఐ కుమారస్వామి మంగళవారం కమ్యూనిటీ కాంట్రాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. పోక్సో కేసుల నమోదు, శిక్షలు , బాల్య వివాహాలు, బాల్య కార్మిక వ్యవస్థ పర్యవ్యసనాలు, ట్రాఫిక్ రూల్స్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 కు కాల్ చేయాలని, లేదా పోలీసును సంప్రదించాలని సూచించారు. ధృవీకరణ పత్రాలు లేని 50 ద్విచక్రవాహనాలు, 10 ఆటోలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలోఎస్ఐ కిరణ్ కుమార్ , మాదారం ఎస్ఐ సౌజన్య, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కేసీఆర్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 18: తెలంగాణ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మంగళవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఎర్రవెల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

రెబ్బెన, ఫిబ్రవరి 18: విద్యుత్ మరమ్మతుల కారణంగా 19వ తేదీ బుధవారం ఉదయం 11 గంటల నుంచి 3గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని రెబ్బెన విద్యుత్ శాఖ ఏఈ ఇమ్రాన్ తెలిపారు. సింగరేణి కాలనీ, మైనారిటీ కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నాణ్యమైన విద్యనందించాలి

కౌటాల, ఫిబ్రవరి 18 : ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. మంగళవారం మండలంలోని వీరవెల్లి, సాండ్‌గాం, కౌటి, పార్డీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయుల విద్యా బోధనను పరిశీలించి, వారు బోధించే విధానానికి అభినందించారు.

వ్యర్థాలను వెంటనే తొలగించాలి

తిర్యాణి, ఫిబ్రవరి 18: మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో పారబోసిన వ్యర్థాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు లెనిన్ అధికారులను కోరారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రాన్ని సైతం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికెన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ తదితర వ్యాపారులు వ్యర్థ పదార్థాలను పాఠశాల వెనకాల పడేయడంతో దుర్వాసనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకోలేదంటే విద్యార్థులతో కలసి ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ మండల నాయకులు సంతోష్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఉపాధి కల్పించాలి

తిర్యాణి, ఫిబ్రవరి 18: మండలంలోని అర్హులైన కూలీలను గుర్తించి ఉపాధిహామీ పథకం ద్వారా వంద రోజుల పని దినాలను కల్పించాలని తుడుందెబ్బ మండలాధ్యక్షుడు తోడసం భాస్కర్ కోరారు. ఈజీఎస్‌లో అవకతవకలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన కూలీలందరికీ పని కల్పించాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రోంపల్లిలో సెల్ నెట్‌వర్క్ సేవలు ప్రారంభం

తిర్యాణి, ఫిబ్రవరి 18: మండలంలోని ఉమ్మడి రోంపల్లి గ్రామంలో మంగళవారం ఎయిర్‌టెల్ సెల్ నెట్‌వర్క్ ప్రారంభమైంది. గ్రామం ఏర్పడి ఎన్నో ఏళ్ళు గడిచినా రోంపల్లి పరిసర గ్రామాల్లో సెల్ సిగ్నల్ రాకపోవడంతో అనేక ఇబ్బందులకు గురైనట్లు తెలిపారు. సిగ్నల్ కోసం కొండలు,గుట్టలు,ఎత్తైన చెట్లు ఎక్కిడం, లేకుంటే ఎలాంటి సమాచారం తెలుసుకోవాలన్నా మండలకేంద్రానికి వచ్చే పరిస్థితి ఉండేదన్నారు. నెట్‌వర్క్ సౌకర్యం కల్పించిన ఎయిర్‌టెల్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

వాహనదారులు పత్రాలు కలిగి ఉండాలి

లింగాపూర్, ఫిబ్రవరి 18: వాహనదారులు అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ గంగన్న కోరారు. మండల కేంద్రంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ట్రాఫిక్ రూల్స్, ధ్రువీకరణపత్రాలపై వాహనదారులకు ఎస్ఐ అవగాహన కల్పించారు.

చందుగూడలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన

కెరమెరి, ఫిబ్రవరి 18: జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు పర్యవేక్షణలో పోలీస్ స్టేషన్ పరిధిలోని చందుగూడ లో పోలీస్ కళాబృందం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, షీ టీమ్స్, గంజాయి నివారణ, డయల్ 100 సేవలు, సీసీ కెమెరాల ఆవశ్యకతపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విజయ్, పోలీసు సిబ్బంది, పోలీస్ కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.

షీ టీం సేవలను వినియోగించుకోవాలి

కెరమెరి, ఫిబ్రవరి 18: షీ టీం, భరోసా సెంటర్ సేవలు వినియోగించుకోవాలని డబ్ల్యూ ఎస్ఐ శిరీష, భరోసా సెంటర్ ఇన్‌చార్జి ఎస్ఐ తిరుమల అన్నారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మంగళవారం కెరమెరి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు షీ టీం భరోసా సెంటర్ సేవలపై అవగాహన కల్పించారు. ఎస్ఐలు తిరుమల, వెంకటేశ్వర్ మాట్లాడుతూ మహిళలు హింస, సైబర్ నేరాలకి గురైతే వెంటనే షీ టీం నంబర్ 8712670561, భరోసా సెంటర్ నంబర్ 8712670564లకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, భరోసా, షీ టీం సభ్యులు శ్రీలత తదితరులు ఉన్నారు.

లైంగికదాడికి యత్నం..మూడేళ్ల జైలు

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 18 : దివ్యాంగురాలిపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తి సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ జిల్లా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు న్యాయమూర్తి యువరాజు తీర్పు ఇచ్చారు. కౌటాల సీఐ ముత్యం రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం చింతలమానేపల్లి మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన ఓ దివ్యాంగురాలిపై 2023 ఏప్రిల్ 18న గ్రామానికి చెందిన కామెర శంకర్ లైంగికదాడికి యత్నించాడు. ఆమె కేకలు వేయగా అక్కడి నుంచి పారిపోయాడు. శంకర్‌పై బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో కామెర శంకర్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.9 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ జీవీఎస్ ప్రసాద్ వాదించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషిచేసిన కోర్టు లైజనింగ్ ఆఫీసర్ రాంసింగ్, ఏఎస్ఐ సీడీవో బాలాజీ, ఏఎస్ఐలను జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

విధులకు ఆటంకం కలిగించిన వారికి రిమాండ్

రెబ్బెన, ఫిబ్రవరి 18: పోలీస్ విధులకు ఆటంకం కలిగించి దురుసుగా ప్రవర్తించిన ఇద్దరు వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకున్నట్లు రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..గంగాపూర్ జాతర సందరర్భంగా రెబ్బెన పోలీస్‌స్టేషన్ పరిధిలో దేవులగూడ సమీపంలో ఎస్‌బీఐ పాయింట్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్, కానిస్టేబుల్ సాగర్ ఉన్నారు. దేవులగూడ ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద ఇద్దరు వ్యక్తులు గొడవ పడుతున్నట్లు గమనించి అదుపు చేసేందుకు వెళ్లిన పోలీసులపై శ్రీకాంత్, షమీం దుర్భాషలడారు.వీరిపై కేసులు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.